# మన బలం చూపించే సమయం ఆసన్నమైంది

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు
- చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ రూరల్, ఏప్రిల్ 22 : మన బలం చూపించే సమయం ఆసన్నమైందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. మంగళవారం మండలంలోని మల్లారం గ్రామంలోని రెడ్డిసంఘ భవనంలో చలో వరంగల్ సభ పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ, ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున్న బీఆర్ఎస్ నాయకులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. రజతోత్సవ సభకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరై ప్రసంగిస్తారని, దీనికి ఈ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో హాజరై వేములవాడ ప్రాంత బలాని చూపించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి ఇంటి నుంచి కార్యకర్త పెద్ద ఎత్తున్న హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డితో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గొస్కుల రవి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, మాజీ వైస్ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు మల్లారం తిరుపతి, మల్లేశం, లచ్చయ్య, తిరుపతి, సుమన్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, మహేశ్, కమలాకర్, దేవరాజు, లచ్చిరెడ్డి, దశరథరెడ్డి, రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



చలో వరంగల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు



ముస్తాబాద్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

### రజతోత్సవ సభకు రామ దండులా కదలాలి

ముస్తాబాద్, ఏప్రిల్ 22 : రజతోత్సవ సభకు మండలం నుంచి ప్రజలు రామదండులా కదలిరావాలని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడారు. ప్రతి కార్యకర్తా ఇంటింటా వివరిస్తూ పెద్దఎత్తున తరివచ్చేలా కృషి చేయాలన్నారు. మాజీ సర్పంచ్ నర్సయ్య, మాజీ మండల కోఆప్షన్ అన్వర్ పాషా, నాయకులు అంజిరెడ్డి, సత్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : వేసవి సెలువుల్లో చోరీలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మహేశ్ బీ గితె సూచించారు. చోరీలపై పోలీసు యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందన్నారు. మంగళవారం ఆయన పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. గ్రామాల్లో, వార్డుల్లో అనుమానిత వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీ ముమ్మురం చేస్తూ పెట్రోలింగ్ చేస్తామన్నారు. ప్రజలు, పోలీసులు సమన్వయంతో కలిసి పని చేస్తే చోరీలను నియంత్రించవచ్చని సూచించారు. ఊళ్లకు వెళ్లేటపుడు చుట్టుపక్కల వారికి, పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

## సభ సక్సెస్ కోసం..



సమావేశమైన నాయకులు, కార్యకర్తలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22 : ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం ఎల్లారెడ్డిపేట బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. మంగళవారం సభకు అధిక సంఖ్యలో హాజరయ్యేందుకు గ్రామంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎడ్ల సందీప్, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు అప్సరున్నీసా, గడ్డం వెంకటేశ్, పందిల్ల నాగరాణి, ఎన్గందుల అనసూయ, నేవూరి వెంకటనర్సింహారెడ్డి, గుండాడి వెంకట్‌రెడ్డి, ఆకుల శ్రీకాంత్, అంబటి విజయ్, భాస్కర్, శ్రీనివాస్, నర్సింలు ఉన్నారు.

## సెలవులో కమిషనర్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 22: మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య 20 రోజుల పాటు సెలవులో వెళ్లారు. జనవరి 29న సమ్మయ్య సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన లావణ్య బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో సమ్మయ్య సిరిసిల్లకు బదిలీపై వచ్చారు. 3 నెలలు కూడా కాకముందే కమిషనర్ సమ్మయ్య లాంగ్‌లీవ్‌పై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. కాగా, మధ్యాహ్నం నుంచి ఆయన ఫోన్ స్విచ్‌డ్ ఆఫ్ రావడంతో అసలు ఏం జరిగిందనేది ప్రశ్నార్థకంగా మారింది. కాగా, ఈ విషయంపై డీఈ వాణిని సంప్రదించగా కమిషనర్ సమ్మయ్య 20 రోజుల పాటు సెలవుపై వెళ్లారని, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిపారు. పని ఒత్తిడి కారణంగానే సమ్మయ్య బదిలీపై వెళ్లారా? లేకా ఇతర ఏ కారణాలతో వెళ్లారనేది తెలియాల్సి ఉంది.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోయినిపల్లి, ఏప్రిల్ 22: మండలంలోని అనంతపల్లి వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు. వేములవాడ రూరల్ మండలం వట్టేంల నుంచి అనంతపల్లికి ఇసుక తరలిస్తున్నారని తెలిపారు. ట్రాక్టర్‌తో పాటు సయ్యద్ అలీ, ఎండీ చిన్న మదర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అదుపులోకి తీసుకున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలి : కలెక్టర్

కలెక్టరేట్, ఏప్రిల్ 22 : నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 241 కొనుగోలు కేంద్రాలకు గాను 239 కేంద్రాల ప్రారంభం చేసి, 198 కొనుగోలు కేంద్రాల నుంచి 16 వేల 22 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, డీఏవో అఫ్జలి బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, రజిత, వసంత లక్ష్మి పాల్గొన్నారు.



కలెక్టరేట్ : మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం 'భూ భారతి'

చందుర్తి, ఏప్రిల్ 22 : భూ భారతి చట్టం 2025 ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతిపై అవగాహన సదస్సును నిర్వహించారు. రాబోయే రోజుల్లో భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేస్తారని తెలిపారు. అనంతరం పలువురు రైతులు సమస్యలను వివరించగా భూ భారతి చట్టంలో రూపొందించినటువంటి అంశాలకు లోబడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మార్వో సీహెచ్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ తిరుపతి, వైస్ చైర్మన్ మల్లేశం అధికారులు తదితరులు ఉన్నారు.

### తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలి

కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని మల్యాల, లింగంపేట గ్రామాల్లోని ఐకేపీ ఆధ్వర్యంలో సనుగుల ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

రుద్రంగి, ఏప్రిల్ 22 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో అలాట్మెంట్ పొందిన వారు త్వరగా నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. మండలంలోని గైదిగుట్టతండా గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను పరిశీలించారు. దశల వారీగా ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తాయన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని తరలించాలని ఆదేశించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఏఎంసీ చెర్మన్ తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

## రైతులు ఆందోళన చెందొద్దు : ప్రభుత్వ విప్

కోనరావుపేట, ఏప్రిల్ 22: రైతులు ఆందోళన చెందవద్దని వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ఎగ్లాస్‌పూర్ గ్రామంలో సోమవారం కురిసిన ఆకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శంకర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, రైతులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

### ధరణి ఇబ్బందులు భూ భారతితో దూరం

రుద్రంగి, ఏప్రిల్ 22: ధరణి చట్టంతో రైతులు, ప్రజలు పడ్డ ఇబ్బందులు నూతర భూ భారతి చట్టంతో దూరం కానున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం భూ భారతి కొత్త ఆర్వో ఆర్ చట్టంపై అధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించగా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో ప్రభుత్వ విప్ హాజరయ్యారు. కలెక్టర్ రైతులకు భూ భారతి చట్టంపై పలు సూచనలు, సలహాలు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఏఎంసీ చెర్మన్ చెలుకల తిరుపతి, వ్యవసాయ అధికారి ప్రియదర్శినితో పాటు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా

కలెక్టరేట్, ఏప్రిల్ 22 : ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలో బాలికల హవా కొనసాగింది. మంగళవారం వెలువవడిన ఫలితాల్లో ఫస్టియర్‌లో 51.74, సెకండియర్‌లో 66.43 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఫస్టియర్‌లో మొత్తం 3,819మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,976 మంది పాస్ కావడంతో 51.74శాతం, సెకండియర్‌లో మొత్తం 3,670మంది పరీక్షలు రాయగా 2,438 మంది ఉత్తీర్ణత కావడంతో 66.43పర్సంటేజీ నమోదైంది. జూనియర్ కళాశాలల్లో ఫస్టియర్‌లో బాలురు 1,486 మంది పరీక్షలు రాయగా 493 మంది ఉత్తీర్ణత సాధించగా 33శాతం, బాలికలు 2,333 మంది పరీక్షలు రాయగా 1,483 మంది ఉత్తీర్ణతతో 63.5శాతం పర్సంటేజీ నమోదైంది. సెకండియర్‌లో బాలురు 1,406 మంది పరీక్షలు రాయగా 752మంది ఉత్తీర్ణత సాధించగా 53శాతం, బాలికలు 2,264 మంది పరీక్షలు రాయగా 1,686 మంది ఉత్తీర్ణత సాధించడంతో 74శాతం పర్సంటేజీ నమోదైంది.

### గురుకుల విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 22: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎంఎల్‌టీ మొదటి సంవత్సరంలో హేమంత్ 500 మార్కులకు గాను 496, ఎల్ఎండీటి మొదటి సంవత్సరంలో ఆదిల్ షరీఫ్‌కు 500 మార్కులకు గాను 483 సాధించి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించారన్నారు. అలాగే రెండో సంవత్సరంలో ఎల్ఎండీటిలో ఎండీ షారుక్ 1000 మార్కులకు కాను 969, ఎంఎల్‌టీలో పీ సంజయ్‌కు 1000 మార్కులకు 962 మార్కులు సాధించారన్నారు. రెండవ సంవత్రసంలో 31 మంది విద్యార్థుల్లో 16 మంది విద్యార్థులు 900 మార్కులకు పైగా మార్కులు సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించేందుకు కృషి చేసిన లెక్చర్లను, విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

### ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

చందుర్తి, ఏప్రిల్ 22 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరంలో విద్యార్థులు 83 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో రెండో సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో చిలుముల రాంచరణ్ 984 మార్కులు, బీపీసీలో ముదిగంపల్లి పావని 922 మార్కులు సీఈసీ లో పిట్టల గ్రీష్మ 765 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలువగా, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 40శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో మ్యాదరి సృజన్ 407, బైపీసీలో బత్తుల సిరి చందన 397, సీఈసీలో మోత్కుపల్లి గౌతమి 348 మార్కులు సాధించి కళాశాల టాపర్ గా ఇచ్చినట్లు తెలిపారు. ఫలితాలు సాధించిన విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించారు.

### రాష్ట్ర స్థాయిలో మూడపల్లి విద్యార్థి ఉత్తమ ప్రతిభ

చందుర్తి మండలం మూడపల్లి గ్రామం చెందిన ఇల్లంతకుంట మమత నాగరాజుల కుమారుడు మని చంద్ర ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మార్కులు సాధించినట్లు గ్రామస్తులు తెలిపారు. మణిచంద్రను గ్రామ మాజీ సర్పంచులు జువ్వాడి అనిల్ రావు, చిలుక అంజిబాబు, సంటి బాబురావు, సంటి అభినందించారు.

### ఉపాధి కూలీలకు ఆకలి తీర్చేలా

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: గొల్లపల్లిలోని ఉపాధి హామీ కూలీల ఆకలి, దప్పిక తీర్చేలా ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్ చొరవ తీసుకున్నారు. మంగళవారం ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న సమయంలో వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని 250 మందికి ఉప్మా, మజ్జిగ పాకెట్లను బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుల చేతుల మీదుగా అందించారు. కొండ సాయి, దాసు, ఎఫ్ఏ చంద్రయ్య తదితరులు ఉన్నారు.



కూలీలకు ఉప్మా,మజ్జిగ పాకెట్లను ఇస్తున్న యువకులు

### ఇద్దరు నకిలీ గల్ఫ్ ఏజెంట్ల అరెస్ట్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 22 : మండల కేంద్రానికి చెందిన రేగుల మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఇద్దరు నకిలీ గల్ఫ్ ఏజెంట్లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రేగుల మోహన్‌ను ఖజకిస్తాన్ దేశానికి ఉపాధి కోసం పంపిస్తామని ఏజెంట్ నిజామాబాద్ జిల్లా దర్పలి మండల కేంద్రానికి చెందిన బుర్ర నర్సాగౌడ్, జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామానికి చెందిన నాడెం నర్సయ్య ఫిర్యాదు దారుడి వద్ద రూ . 1,75,000, బోనిపల్లి గ్రామానికి చెందిన పోలే తిరుపతి రూ. 1,80,000 వేలను తీసుకుని నఖిలీ ఖజకిస్తాన్‌కు చెందిన నఖిలి విజాలు, నఖిలీ ఫ్లైట్ టికెట్లు అందించి మోసం చేశారని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏజెంట్లపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

### వడదెబ్బతో ఒకరి మృతి

ఇల్లంతకుంట రూరల్, ఏప్రిల్ 22 : మండలంలోని వల్లం పట్లకు చెందిన పాత భూమయ్య (55) రోజు మాదిరిగానే ఇదే మండలంలోని రహీంఖాన్‌పేటలో కందులు, చింతగింజలు కొనుగోలు చేసేందుకు వెళ్లి ఉదయం 11 గంటలకు ఇంటికి తిరుగు ప్రయాణంలో రహీంఖాన్‌పేట పోచమ్మ ఆలయ సమీపంలో వడదెబ్బకు గురై కిందపడిపోయాడు. స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించి 108లో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

### అవగాహన కోసమే పొలం బాట

ముస్తాబాద్, ఏప్రిల్ 22: విద్యుత్ సమస్యలు క్షేత్ర స్థాయిలో తెలుసుకోవడం వాటి పరిష్కరం కోసమే సెస్ పాలకవర్గం విద్యుత్ శాఖ-రైతు పొలం బాట కార్యక్రమం నిర్వహిస్తుందని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మొర్రాయిపల్లెలో ఏఈ విష్ణు తేజ సిబ్బందితో కలిసి రైతు పొలంబాట నిర్వహించారు.

### ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: మండల కేంద్రంలో కిషన్‌దాస్‌పేట ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో కృష్ణహరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు సహపాఠ్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేటట్లు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

### వరలక్ష్మి ఫౌండేషన్‌తో ఉపాధి

కోనరావుపేట, ఏప్రిల్ 22: జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్‌తో మహిళా ఉపాధి కల్పిస్తున్నమని ఫౌండేషన్ మేనజర్ మహేశ్ అన్నారు. మంగళవారం నాగారం వరలక్ష్మి ఫౌండేషన్‌లో ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 60 మంది టైలరింగ్ కోర్స్ పూర్తి చేసిన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు.

### యాదవుల సమస్యలు పరిష్కరించాలి

గంభీరావుపేట, ఏప్రిల్ 22 : గొర్లు, మేకలను పోషించుకుంటూ జీవనోపాధి పొందుతున్న యాదవుల ఆయా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు దేవేందర్‌యాదవ్ అన్నారు. మండలంలోని ముస్తాఫానగర్‌లో మంగళవారం మండల యాదవ సంఘ సభ్యులు ఏర్పాటు చేసుకున్న కార్యక్రమంలో కొక్కు దేవేందర్‌యాదవ్ పాల్గొన్నారు. జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా యాదవులు వారిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. యాదవ సంఘ నాయకులు మల్లేశం, రాజు, శ్రావణ్, కృష్ణకాంత్, కృష్ణమూర్తి, రవి, గొడుగు దేవయ్య, నాగరాజు, రాజు, మల్లేశం, అన్వేశ్, మహేశ్ ఉన్నారు.

### అనుమానాస్పదంగా యువకుడి మృతి

బోయినిపల్లి, ఏప్రిల్ 22 : మండలకేంద్రానికి సమీపంలో అనుమానాస్పదంగా యువకుడి మృతి చెందిన ఘటన మండలంలో కలకలం రేపింది. ఎస్ఐ పృథ్వీధర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సంద్రగిరి రాకేశ్ (24) కరీంనగర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 17న ఇంట్లో పండుగ ఉందని వచ్చి 18న బయటకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడన్నారు. అప్పటి నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని, రాకేశ్ ఇంటికి తిరిగి రాలేదని మృతుడి తండ్రి తెలిపారన్నారు. మంగళవారం గ్రామ శివారులో యువకుడి మృత దేహం ఉందని తెలుపడంతో మృతుడి తండ్రి మల్లేశం వెళ్లి చూడగా, అది తన కొడుకు మృతదేహమని తెలిపాడన్నారు. కొన్ని రోజులుగా రాకేశ్ ఏదో బాధలో ఉన్నాడని, తను తన కొడుకును అడుగగా తన ప్రైవేట్ ఫొటోలు తన ఫ్రెండ్ వద్ద ఉన్నాయని, అవి బయటకు వస్తే తన పరువుపోతుందని చెప్పి బాధపడ్డాడని మృతుడి తండ్రి తెలిపినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోవడంతో ఘటనా స్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం చేసి ఖననం చేశారు.

### భవిష్యత్ తరాల కోసం పచ్చని భూమిని అందిద్దాం

వేములవాడ, ఏప్రిల్ 22: భవిష్యత్ తరాల కోసం పచ్చని భూమిని అందిద్దామని హెచ్ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం 55వ వార్షికోత్సవం సందర్భంగా వేములవాడ న్యూ అర్బన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, శారద ఉన్నారు.

### క్రమశిక్షణతో ఉన్నత స్థానానికి ఎదగాలి

కోనరావుపేట, ఏప్రిల్ 17: విద్యార్థినులు క్రమశిక్షణే ఉన్నత స్థానానికి ఎదగడానికి సోపానమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ అన్నారు. మరిమడ్ల ఏకలవ్య గిరిజిన మోడల్ రేసిడెన్షియల్ స్కూల్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, యోగ అభ్యాసం వల్ల భావోద్వేగాలు నియంత్రణలో ఉంచుకోని ఉన్నత విద్యాభ్యాసం చేయాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తద్వారా జరిగే అనర్థాలు సైతం వివరించారు. అనంతరం విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. ఇక్కడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

## మోసాన్ని జీర్ణించుకోలేక కుల బహిష్కరణను తట్టుకోలేక..

- ఎల్లారెడ్డిపేటలో యువకుడి ఆత్మహత్య
- బొప్పాపూర్‌లో విషాదం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: సోషల్ మీడియాలో పరిచయమైన వివాహిత మోసం చేయడం, భూ తగాదా విషయంలో కుల బహిష్కరణ కావడంతో ఓ యువకుడు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన బొప్పాపూర్‌లో విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొప్పాపూర్‌కు చెందిన గడ్డి నరేందర్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ ఉండగానే సోషల్ మీడియాలో మండల కేంద్రానికి చెందిన బీపేట రేష్మతో పరిచయం ఏర్పడింది. ఫోన్‌లో మాట్లాడిన తీరుతో అదే ప్రేమగా భావించాడు. గల్ఫ్ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత సదరు మహిళకు వివాహమై పిల్లలున్నారని తెలుసుకున్నాడు. ఇలా ఎందుకు..? చేశావని ఆమె వద్దకు వెళ్లి నిలదీశాడు. రేష్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నరేందర్‌ను రిమాండ్‌కు తరలించారు. అంతకు ముందే గ్రామంలో భూమి విషయంలో కొందరు కుల పెద్దలు కల్పించుకుని నరేందర్‌ను కుల బహిష్కరణ చేశారు. ఇవన్నీ జరుగుతున్న తరుణంలో నెల రోజుల క్రితం నరేందర్ తండ్రి నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బెయిలుపై తండ్రి అంత్యక్రియలకు హాజరయ్యాడు. అయితే మహిళ నమ్మించి మోసం చేయడం, మరో వైపు కుల బహిష్కరణ, తండ్రి మరణాన్ని తలుచుకుని మనస్తాపం చెందాడు. సోమవారం రేష్మ అద్దెకు ఉంటున్న ఇంటి వద్దకు వెళ్లి ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. తనను సంజన (రేష్మ) మోసం చేసిందని, కుల పెద్ద మనుషులు ఇబ్బందులు పెట్టారని ఆరోపించాడు. బాధితుడిని హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. నరేందర్ తల్లి ఫిర్యాదు మేరకు రేష్మతో పాటు ముగ్గురు కుల సంఘం సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.



గడ్డి నరేందర్(ఫైల్)

### వధూవరులను ఆశీర్వదించిన చల్మెడ

వేములవాడ, ఏప్రిల్ 22: పట్టణానికి చెందిన చీకోటి రమేశ్ కూతురు వివాహానికి వేములవాడ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే పట్టణంలోని సూరజ్ టైలర్‌ను మర్యాదపూర్వకంగా కలవగా యజమాని శంకర్ సన్మానించి, సత్కరించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సిద్ధంశెట్టి వేణు, నాయకులు రాజు, శేఖర్, కృపాల్, రవీందర్, అశోక్ తదితరులు ఉన్నారు.

### ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

వీర్నపల్లి, ఏప్రిల్22: కొనుగోలు కేంద్రాల్లో 20రోజులుగా పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మండలంలోని వన్‌పల్లి రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ ముక్తర్‌పాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టార్పలిన్లు లేక అకాల వర్షాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తడుస్తున్నాదని తెలిపారు. కోతులు, అడవిపందులు బెడుద ఎక్కువగా ఉన్నాదని పేర్కొన్నారు, దొడ్డురకం వడ్లను మాత్రమే తీసుకుంటామని చెప్తున్నారని, సన్నవడ్లను కూడా కొనుగోలు చేయాలన్నారు. రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు.

### ప్రభుత్వ విధానాలతో రైతులు నష్టపోతున్నారు

కోనరావుపేట, ఏప్రిల్ 22 : ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా నిర్వహించాలని సీపీం జిల్లా కార్యదర్శి ముశం రమేశ్ అన్నారు. నిమ్మపల్లి గ్రామంలో తడిసిన వరిధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చి న ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలతోనే రైతులకు కష్టాలు వస్తున్నాయని మండిపడ్డారు. రైతులకు నష్టం జరిగితే సీపీఎం ఆధ్వర్యంలో సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రం, అశోక్, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారాలతో సంపూర్ణ ఆరోగ్యం

గంభీరావుపేట, ఏప్రిల్ 22: పండ్లు, కూరగాయలు తదితర పౌష్టికాహారాలను తీసుకున్నట్టయితే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని కేజీ టు పీజీ సముదాయం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసుకున్న పోషణా పక్షం కార్యక్రమానికి వైద్యాధికారి హాజరైనారు. అంగన్‌వాడీ టీచర్లు రూపొందించిన పౌష్టికాహారాలపై చిన్నారులు, తల్లులు, గర్భవతులకు వారు అవగాహన చేశారు. సీహెచ్‌వో రమేశ్, అంగన్‌వాడీ సీడీపీవో, సూపర్‌వైజర్, టీచర్లు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో వారోత్సవాలు

బోయినిపల్లి, ఏప్రిల్ 22: బోయినిపల్లి మండలం విలాసాగర్, బూరుగుపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ ఆధ్వర్యంలో పోషణ పక్ష వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పాలు, కోడిగుడ్లు, పౌష్టికాహారం, గర్భిణీ, బాలింతలకు అందిస్తున్న ఆరోగ్యలక్ష్మి సంపూర్ణ భోజన పథకం ద్వారా అందిస్తున్న పోషక ఆహారం తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, జ్యోత్నారాణి, శమంతక మణి, స్వర్ణలత, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### సెస్ 51వ మహాసభ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 22: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం 51వ మహాసభ ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు సెస్ ఎండీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విద్యానగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి సెస్ గ్రామ ప్రాతినిధ్య సభ్యులు అందరూ హాజరు కావాలని తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**పాస్ పోర్ట్ పోయినది**
తేదీ: 18-4-2025 శుక్రవారం రోజున NTPC, మాతంగి కాలనీలోని మా ఇంటి వద్ద నుండి మేడిపల్లి సెంటర్‌కి వెళ్తుండగా మార్గమధ్యంలో నాయొక్క ఒరిజినల్ Passport (No: RA8322423) పోయినది. దొరికిన వారు సంప్ర: M. యశ్విక D/o. M. ప్రణయ్ కుమార్
సెల్: 99125 00330

**పాస్ పోర్ట్ పోయినది**
తేదీ: 18-4-2025 శుక్రవారం రోజున NTPC, మాతంగి కాలనీలోని మా ఇంటి వద్ద నుండి మేడిపల్లి సెంటర్‌కి వెళ్తుండగా మార్గమధ్యంలో నాయొక్క ఒరిజినల్ Passport (No: PB2187213) పోయినది. దొరికిన వారు సంప్ర: G. జ్యోత్స్న D/o. G. శ్రీనివాస్.
సెల్: 99125 00330

**పాస్ పోర్ట్ పోయినది**
తేదీ: 18-4-2025 శుక్రవారం రోజున NTPC, మాతంగి కాలనీలోని మా ఇంటి వద్ద నుండి మేడిపల్లి సెంటర్‌కి వెళ్తుండగా మార్గమధ్యంలో నాయొక్క ఒరిజినల్ Passport (No: S5081107) పోయినది. దొరికిన వారు సంప్ర: ప్రణయ్ కుమార్ M, S/o. రవీందర్ M.
సెల్: 99125 00330

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189